

ఎమ్మెల్సీ అభ్యర్థుల్లోనూ సామాజిక సమతూకం : కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే కోటాలో శాసనమండలికి వైసిపి అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సామాజిక సమతూకాన్ని మరోసారి పాటించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీల ఎంపికలో సామాజిక న్యాయానికి వైసిపి కట్టుబడి ఉందని తెలిపారు. బిసిలంటే బ్యాక్వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ అని మరోసారి జగన్ నిరూపించారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలను పరిపాలనలో భాగస్వామ్యం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. స్థానిక సంస్థల కోటాలో జిల్లా నుంచి నర్తు రామారావును ఎంపిక చేయడంతో యాదవ సామాజిక తరగతికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బిసిలను వాడుకుని వదిలేస్తే, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకొచ్చి సిఎం జగన్ తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

నర్తుకే ఎమ్మెల్సీ బెర్తు

- స్థానిక సంస్థల శాసన మండలి వైసిపి అభ్యర్థిగా రామారావు
- జిల్లా నుంచి తొలిసారిగా యాదవులకు చట్టసభల్లో స్థానం!




ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, కవిటి

స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలి అభ్యర్థి ఎవరన్న ఉత్కంఠ వీడింది. విధేయత, సామాజిక తరగతుల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఇచ్ఛాపురానికి చెందిన సీనియర్ నాయకుడు నర్తు రామారావు పేరును అధిష్టానం ఖరారు చేసింది. జిల్లా నుంచి తొలిసారిగా యాదవులకు చట్టసభల్లో స్థానం లభించనుంది. 1990 నుంచి నర్తు రామారావు క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన కీలకపాత్ర పోషించారు. ధర్మాన సోదరులకు రామారావు అత్యంత సన్నిహితుడు. 2004లో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌ను ఆశించిన ఆయన, నరేష్ కుమార్ అగర్వాలాకు దక్కడంతో ఆయన గెలుపు కోసం పనిచేశారు. టిడిపి ఆవిర్భావం తర్వాత ఇచ్ఛాపురం నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా మారింది. అటువంటిది తొలిసారి 2004లో కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. 2009లో రామారావుకు టిక్కెట్ వచ్చినా ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి పోటీ చేయడంతో త్రిముఖ పోటీ కారణంగా రెండు వేల ఓట్లతో ఓటమిపాలయ్యారు. వైసిపి ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరిన రామారావు రాష్ట్ర కార్యదర్శిగా, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసినా గ్రూపుల పోరుతో ఓటమి చవిచూశారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక ఆయనకు గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. టిడిపి ఎమ్మెల్యే ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పాగా వేసేందుకు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పదవిని ఆ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పిరియా సాయిరాజ్ సతీమణి విజయకు అధిష్టానం కేటాయించింది. తాజాగా ఎమ్మెల్సీ పదవినీ అదే నియోజకవర్గానికి కేటాయించింది. రామారావుకు ఎమ్మెల్సీ టిక్కెట్ ఖరారులో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్ కీలకపాత్ర పోషించినట్లు సమాచారం.

స్థానిక సంస్థల కోటాలో వైసిపి అభ్యర్థి ప్రకటనపై అధిష్టానం తీవ్ర కసరత్తు చేసింది. జిల్లా నుంచి యాదవ, తూర్పుకాపు, రెడ్డిక సామాజిక తరగతుల్లో ఒకరికి అవకాశం లభిస్తుందని ముందు నుంచే ప్రచారం సాగింది. మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, హనుమంతు కిరణ్ కుమార్, చల్లా రవికుమార్ ఇలా ఎవరికి వారు టిక్కెట్ కోసం తమ ప్రయత్నాలు సాగించారు. 2019 ఎన్నికల ముందు వరకు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న నర్తు రామారావును ముఖ్యమంత్రి జగన్ తప్పించారు. పిరియా సాయిరాజ్‌కు టిక్కెట్ ఇచ్చిన సమయంలో అధికారంలోకొస్తే ఎమ్మెల్సీ చేస్తానని హామీనిచ్చారు. అధికారంలోకి వచ్చాక జిల్లా నుంచి దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్‌ను మండలికి పంపించారు. జిల్లాలో పెద్దసంఖ్యలో ఉన్న యాదవులకు చట్టసభల్లో స్థానం కల్పించాలని కొద్ది నెలల కింద నర్తు రామారావు నేతృత్వాన యాదవ గర్జనను నిర్వహించారు.

స్థానిక సంస్థల కోటాలో యాదవులకు అవకాశం ఇవ్వాలని భావించిన జగన్, గతంలో రామారావుకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. స్థానిక సంస్థల్లో వైసిపికి తిరుగులేని ఆధిక్యం ఉంది. దీంతో రామారావు ఎన్నిక లాంఛనప్రాయమే.



సిఎం జగన్‌ను పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్తు రామారావు, సాయిరాజ్



ఊరేగింపుగా చక్రతీర్థ స్నానాలకు తీసుకెళ్తున్న ఉత్సవమూర్తులు

జన 'చక్రతీర్థం'

వంశధారకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - జలుమూరు

మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు యాత్రికులు పోటెత్తారు. జిల్లా నుంచే కాక విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా నుంచీ యాత్రికులు చక్రతీర్థ స్నానాలకు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి ఆదివారం అర్ధరాత్రి నుంచే బారులు తీరారు. సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు దర్శనాలు నిలుపుదల చేసిన అనంతరం ఆలయంలోని పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను అలంకరించి బయటకు తీసుకొచ్చారు. నంది వాహనంపై విగ్రహాలను ఉంచి పూజల అనంతరం 1.40 గంటల సమయంలో తిరువీధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నంది వాహనంపై ఉత్సవమూర్తులను ఆలయానికి ఉత్తర దిశగా ఉన్న మిరియాప్పల్లి వంశధార రేవు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి స్నానాలు ఆచరించిన అనంతరం లక్షలాది మంది యాత్రికులు స్నానాలు చేశారు. వంశధార నదికి రెండువైపులా కట్టుదిట్టంగా ఐరన్ బారికేడ్లు పెట్టారు. చక్రతీర్థ స్నానాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. మిరియాప్పల్లి రేవు వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్ రాధిక డ్రోన్ ద్వారా పరిశీలించారు. మరోవైపు శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి వచ్చిన యాత్రికులకు మెట్టపేట వద్ద ఆ గ్రామస్తులు అన్న సంతర్పణ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను అందజేశాయి. పంచాయతీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం కల్పించారు. పలు గ్రామాలకు చెందిన సత్యసాయి సేవ సమితి సభ్యులు తమ సేవలు అందించారు.



డ్రోన్ ద్వారా పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ముఖ హాజరు రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ ఉద్యోగులు, ఒప్పంద కార్మికుల జీతాలు, ఉద్యోగాలకు ఎసరు పెట్టే ఎఫ్ఆర్ఎస్ (ముఖ హాజరు) విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రీకాకుళం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుగుళ్ల. గణేష్, ఎన్.బలరాం డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులు ముఖ హాజరును రద్దు చేయాలని, కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ శాఖలు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించి ఇప్పటివరకు అమలులో ఉన్న హాజరు విధానం(ఎండి ఎస్ఆర్ఎస్) స్థానంలో కొత్త విధానాన్ని జిఒ 159 ప్రకారం జనవరి 16 నుంచి అమలులోకి తెచ్చిందన్నారు. ఈ కొత్త హాజరు విధానం ద్వారా ఎవరి సెల్ ఫోన్‌లో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫోటోతీసి యాప్ ద్వారా హాజరుఉన పంపించాలని షరతులు విధించారన్నారు. మున్సిపల్ కార్మికుల్లో అత్యధిక మంది చదువు రాని వారు, ఎక్కువ మందికి స్మార్టుఫోన్లు లేవని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పంపించగల అనుభవం అసలే లేదన్నారు. ప్రభుత్వం చెప్పినట్లు తన ఫొటోను తాను తీసుకొని పంపించకపోతే తాను రోజంతా పనిచేసినా హాజరు పడక, జీతంలో కోత విధిస్తారని చెప్పారు. వరుసగా 4, 5 రోజులు హాజరు పడకపోతే ఉద్యోగం నుంచి తొలగించే ప్రమాదం లేకపోలేదని అన్నారు. కొత్త విధానం పూర్తిగా అమలైతే పండగలు, ఇతర సెలవులు కూడా అమలు కావని, కార్మికులు బానిసలుగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఇంతటి ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్న నూతన హాజరు విధానం మున్సిపల్ సిబ్బంది, ఒప్పంద కార్మికులందరికీ ఉరితాడు లాంటిదని, అందుకే ఈ విధానాన్ని తక్షణమే రద్దుచేసి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కళ్యాణ రాజు, డి.చిట్టి, ఎ.జనార్ధనరావు, శేఖర్, జె.మాధవి, జె.రమేష్, రాము, రాజేష్, రాజశేఖర్, ఎన్.వెంకటరమణ, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గృహ నిర్మాణాల నాణ్యతలో రాజీ వద్దు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వాస్తవ పరిస్థితుల రీత్యా పనిలో జాప్యమైతే అటువంటి వాటిని పరిశీలిస్తామని, ప్రగతిలో నిర్లిప్తత, నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చూస్తూ ఉండబోమని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గృహనిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల మూడో తేదీన స్పెషల్ డ్రైవ్ క్రింద నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. అయినా కొన్ని మండలాల్లో నిర్మాణాల్లో ప్రగతిని కనబరచలేదన్నారు. ఇందుకు గల కారణాలపై ఆరా తీసిన కలెక్టర్ ఇప్పటికే ఆర్‌సి, ఆర్ఎల్‌సి స్థాయిలో ఉన్న గృహాలపై దృష్టిసారించాలని సూచించారు. అటువంటివి జిల్లాలో పది వేలకు పైగా ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తే జిల్లా ప్రగతిలో ముందుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రగతిని కనబరచని మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉంటామన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతిరావు, సహాయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల మండలి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మార్చి 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు చెందిన సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటిని కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఓటర్ల నమోదు, తిరస్కరణ, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, కౌంటింగ్ కేంద్రాల ప్రతిపాదనలు, బ్యాలెట్ బాక్సుల సంసిద్ధత, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ మొదలైందని తెలిపారు. ఇప్పటివరకు ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని చెప్పారు. సరిపడే విధంగా బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయన్నారు. క్లయిమ్‌లకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు కూడా పూర్తి చేశామని చెప్పారు. వాటిలో ఎటువంటి సమస్యలు లేవన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసిసి, ఎంసిఎంసి ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్ తదితర అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించనున్నామని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, బ్యాలెట్లను విశాఖపట్నం రిటర్నింగ్ అధికారి సిద్ధం చేయనున్నట్లు వివరించారు. కాన్ఫరెన్స్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, స్థానిక సంస్థల మండలి ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ

మార్చి 7 నుంచి ఒటి బహిష్కరణ

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.భానుమూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మార్చి 7వ తేదీ నుంచి ఒటి బహిష్కరిస్తున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.భానుమూర్తి, జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన చలో శ్రీకాకుళం పేర మహా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసిలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆరు నెలలుగా ఒటి, ఇతర అలవెన్సులు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 17 రోజులుగా శ్రీకాకుళం-2 డిపో సమస్యలపై నిరసనలు తెలుపుతున్నా డిపో యాజమాన్యం, జిల్లా రవాణాధికారి పట్టించుకోవడం లేదని అన్నారు. యాజమాన్యం తీరును నిరశిస్తూ మార్చి 7 నుంచి ఒటి బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. 1-19 సర్కులర్‌ను అమలు చేయాలని, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, ఉద్యోగులపై అధికారుల వేదింపులు అపాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని డిపోల్లో ఉద్యోగుల సమస్యలు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.ఎన్.భూషణరావు, ఆరు జిల్లాల సెక్రటరీలు, డిపో కార్మికులు హాజరయ్యారు.



మహా నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు

'స్పందన'కు 135 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలు సమస్యలపై జిల్లావ్యాప్తంగా 135 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ బి.నవ్య, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఉప కలెక్టర్ జి.జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వినతులను స్వీకరించారు. జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి తనను వేధింపులకు గురిచేస్తున్నారని కింతలి బిసి హాస్టల్‌కు చెందిన ఉద్యోగి పైడి లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఒంటరిగా ఉన్న తనను దూర ప్రాంతానికి బదిలీ చేశారని, దీనిపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేశారని తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదు కారణంగా సస్పెన్షన్‌ను తొలగించినా వేధింపులు ఆపడం లేదని వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతమైన ఎచ్చెర్ల నియోజకవర్గంలో విద్యుత్ కోతలు అరికట్టాలని, రైతులకు నిరంతరాయంగా ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ ఇవ్వాలని ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. రణస్థలం మండలకేంద్రంలో జాతీయరహదారి ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్డుకు అనుకోని ఉన్న చిరువ్యాపారులను ఖాళీ చేయించారని, దీనివల్ల జీవనభృతి కోల్పోయామంటూ పలువురు చిరువ్యాపారులు వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలు సమస్యను పరిష్కరించాలని పొందూరు, ఆమదాలవలస ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు కోరారు.



ఎంపీతో మాట్లాడుతున్న మాజీ సైనికులు

ఎంపీని కలిసిన మాజీ సైనికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ స్థాయిలో సైనికుల సమస్యలను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో ప్రస్తావించడం ఆనందంగా ఉందని మాజీ సైనికుల సమాఖ్య మాజీ కటకం పూర్ణచంద్రరావు అన్నారు. నగరంలోని ప్రజాసదన్‌లో ఎంపీని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశ భద్రతలో అహర్నిశలు శ్రమించి విశ్రాంతి పొందిన సైనికులతో పాటు విధి నిర్వహణలో వీర మరణం పొందిన సైనికుల పక్షాన పార్లమెంట్‌లో మాట్లాడడం అభినందనీయమన్నారు. టోల్ గేటులో పనిచేసిన 106 మంది మాజీ సైనికులను తొలగించడాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, ఇసిఎచ్ఎస్ అధికారి, విశ్రాంత కల్నల్ మెండ నారాయణరావు, క్యాంటీన్ మేనేజర్ టి.కృష్ణారావు, సభ్యులు బి.సంజీవరావు, ఎస్.రామారావు, ఎస్.లక్ష్మణరావు, పి.మురళీధర్‌రావు, ఎస్.రామకృష్ణ, పి.పద్మావతి, ఎ.లక్ష్మి, పి.భారతమ్మ, కె.జగ్గమ్మ పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఆచార్య ఎన్‌జి రంగా రీసెర్చ్ సెంటర్

కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రీసెర్చ్ సెంటర్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సమ్మె బాట పట్టారు. పట్టణ శివారులో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్, కెవికెల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికులను కార్పొరేషన్‌లో చేర్చాలన్నారు. అలాగే సంవత్సరం మొత్తం పనిని కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యాలయాల్లో స్వీపర్, అటెండర్ పోస్టుల్లో ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. కార్మికులకు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణ నష్టపరిహారాన్ని కాంట్రాక్టు కార్మికులకూ వర్తింజేయాలన్నారు. కార్మికశాఖ ఆదేశాల ప్రకారం జాతీయ, పండగ సెలవులను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు వెంకటరావు, సూర్యనారాయణ, గణపతి, తేజ, చిట్టిబాబు, సునీత, సీతాలక్ష్మి, మల్లేశ్వరి, శ్రావణ సంధ్య పాల్గొన్నారు.

సోంపేట రైల్వేస్టేషన్

అభివృద్ధికి నోచుకునేదెప్పుడో?

- మౌలిక వసతుల కల్పన తీరు అధ్వానం
- మరుగుదొడ్లు ఉన్నా... వినియోగం అంతంతే

ప్రజాశక్తి- కంచిలి

నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంత ప్రజలకు, కంచిలి, సోంపేట మండలాల వాసులకు ఎంతో ఉపయోగపడుతున్న కంచిలి రైల్వేస్టేషన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. నాయకులు రావడం, వినతులు అందించడం ఇదిగో అభివృద్ధి చేసేస్తున్నామనడమే తప్ప ఆచరణలో ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఖుర్దా డివిజన్ పరిధిలోని ఆంధ్రా రైల్వే స్టేషన్‌ల్లో ఆదాయం వచ్చే స్టేషన్‌గా కంచిలి గుర్తింపు పొందింది. అయితే అభివృద్ధి విషయంలో మాత్రం అన్నీ స్టేషన్ల కన్నా చివరలో ఉండటంతో స్థానిక ప్రజలు తమకు సరైన సౌకర్యాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు కంచిలి రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పన చేసి, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయాలని పరిసర ప్రాంత వాసులు కోరుతున్నారు.

కంచిలి (సోంపేట) రైల్వే స్టేషన్‌కు ఆనుకుని కంచిలి మండలంలోని 30 పంచాయతీలతో పాటు సోంపేట, కవిటి, ఇచ్ఛాపురంలోని పలు పంచాయతీల ప్రజలు తమ రాకపోకలకు ఈ స్టేషన్‌పైనే ఆధారపడుతుంటారు. ఖుర్దా డివిజన్ పరిధిలోని ఆంధ్రా రైల్వే స్టేషన్లలో కంచిలి స్టేషన్ నుంచి అత్యధికంగా ఆదాయం వస్తున్నా, అధికారులు మాత్రం ఈ అభివృద్ధిపై శీతకన్ను వేస్తున్నారని ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతం నుంచి ఎక్కువ మంది ముంబాయి, అహ్మదాబాద్, బెంగుళూరు, ఇతర రాష్ట్రాలకు నిత్యం రాకపోకలను ఈ స్టేషన్ నుంచే సాగిస్తుంటారు.

దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. స్టేషన్‌లో ఉన్న నాలుగు ఫ్లాట్ ఫారాలకు పూర్తిస్థాయిలో రేకుల షెడ్‌లు లేకపోవడంతో వర్షం పడినా, ఎండ ఎక్కువగా ఉన్నా అక్కడే ప్రయాణికులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంటోంది. అలాగే ప్రయానికుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు సైతం టాప్‌లు సరిగా లేక నీరు వృథాగా పోతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారు నిల్గొనేందుకు వీలుగా ఫ్లాట్‌ఫారాలపై రేకుల షెడ్‌లను మరింత విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే టిక్కెట్ కౌంటర్ ఒక్కటే ఉండటం, రిజర్వేషన్ కౌంటర్ దగ్గర సరైన వసతి లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వినతులకే పరిమితం

కంచిలి రైల్వే స్టేషన్‌లో పలు వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు సూపర్‌ఫాస్ట్ ట్రైన్‌లను నిలుపుదల చేయాలని ఈ ప్రాంత వాసులు ఏళ్ల తరబడి కోరుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. దీనిపై జిల్లాకు చెందిన ఎంపీ, మంత్రులు సైతం అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం, స్థానిక రైల్వే యూజర్స్ కమిటీ ఆధ్వర్యాన ఆందోళనలూ చేశారు. కానీ, ఇప్పటికీ పూరీ-అహ్మదాబాద్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు పాసింజర్ ట్రైన్‌లను పలాస వరకు కాకుండా బరంపురం వరకు పొడిగించాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉద్దానం ప్రాంతం నుంచి వలస వెళ్లిన వారంతా ఎక్కువ మంది అహ్మదాబాద్, బెంగులూరు, ఢిల్లీ వంటి ప్రదేశాల్లో ఉంటున్నారు. దీంతో ఈ ఎక్స్‌ప్రెస్‌లను కంచిలి స్టేషన్‌లో నిలుపుదల చేస్తే వారికి మరింత ప్రయోజనం చేకూరడంతోపాటు ఆదాయం మరింత పెరుగుతుందని పలువురు భావిస్తున్నారు.

డిజిటల్ బోర్డులు ఏర్పాటుకు ఎదురుచూపులే

కంచిలి రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్‌ఫారాలపై ప్రయాణికులు రైళ్ల కోసం వేచి చూసే సమయంలో వారికి సౌకర్యంగా



సోంపేట రైల్వే స్టేషన్

ఉండేందుకు డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంవత్సరాలుగా అటు యూజర్స్ కమిటీ సభ్యులు, ఇటు ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. కానీ చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

దీంతో చిన్న పిల్లలు, వృద్ధులతో వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే భోగీలను సూచించే డిజిటల్ బోర్డుల ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే తాగునీరు కుళాయిలు ఉన్నా, వాటి వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో ఎవరూ వాటిని వినియోగించడం లేదు. ప్రయాణికులు నిల్చొనేందుకు నీడా కరువుతోంది. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణను పట్టించుకునే నాథుడే లేడంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో చెప్పక్కర్లలేదు. స్టేషన్‌లో ఉన్న మరుగుదొడ్లకు, ఫ్లాట్‌ఫారంపై ఉన్న మరుగుదొడ్ల భవనాలకు నిత్యం తాళాలు వేసి ఉంటాయి. వీటిని అధికారులు ఉపయోగిస్తుంటారు తప్ప, ప్రయాణికులు ఉపయోగించిన దాఖాలాలు కనిపించవు. స్టేషన్‌లో ఒక ఫ్లాట్‌ఫారం నుంచి వేరొక ఫ్లాట్‌ఫారానికి వెళ్లేందుకు వంతెన ఉన్నా... ఎక్కువ మంది ప్రయాణికులు పట్టాలను దాటుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ఇటువంటి సమయాల్లో స్టేషన్ అధికారులు కళ్లప్పగిస్తు చూస్తుంటారే తప్ప వారించే పరిస్థితులు లేవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రయాణికుల నుంచి అత్యధిక ఆదాయం పొందుతున్నా వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇష్టానుసారంగా కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ జెడ్ రోడ్డులోని సంతోషిమాత ఆలయం వద్ద నిర్మించిన కల్వర్టుతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. యధా రాజా.. తథా ప్రజా అన్న చందంగా పనులు జరుగుతున్నాయి. చిన్నపాటి వర్షానికే వర్షపునీరు చేరి రోడ్డుపై నిలిచిపోతోంది. రోడ్డు చెరువును తలపించేది.. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.20 లక్షలతో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అయితే చెరువుకు మూడు అడుగులు లోతుగా కల్వర్టు నిర్మాణ పనులు చేస్తున్నారు. ముందు చూపు లేకుండా అనాలోచిత నిర్ణయం వల్ల చేపట్టిన ఈ కల్వర్టు నిరుపయోగంగా మారనుంది. ఏ సమస్య పరిష్కారానికి అధికారులు కల్వర్టు కడుతున్నారో.. ఈ పనుల వల్ల ఆ సమస్య మరింత పెరగనుందని స్థానికులు వాపోతున్నారు. కాలవ ఎదురుగా కల్వర్టు నిర్మాణం చేపడుతామన్న ప్రజాప్రతినిధులు చెప్పినప్పటికీ నేడు ఆ పరిస్థితి లేదు. ఈ కల్వర్టు నిర్మాణం జరిగితే ప్రజలు కష్టాలు తీరుతాయని, సంతోషిమాత ఆలయానికి వచ్చే యాత్రికులకు ఇబ్బందులు ఉండవని భావించిన ప్రజలు నేడు జరుగుతున్న కల్వర్టు పనులు చూసి ప్రజలు ఆశ్చర్యము వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు దష్టి చారించి కల్వర్టు గూండా నీరు వెళ్లే విధంగా కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టాలని పలువురు ప్రజానీకం కోరుతున్నారు.



చెరువు కంటే లోతుగా నిర్మించిన కల్వర్టు



మృతి చెందిన లోకనాథం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని ఆనందపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటకు చెందిన సీపాన లోకనాథం (40) తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం రాత్రి అత్తవారి ఊరు దవళపేట వచ్చాడు. ఉదయం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. ఆనందపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శ్రీకాకుళం నుంచి రాజాం వెళ్తున్న ఓ ప్రయివేటు బస్సు బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లోకనాథం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, డిగ్రీ చదువుతున్న లలిత, ఇంటర్ చదువుతున్న లీల ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో రెండు గ్రామాల్లోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ చామంతుల రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న సూర శ్రీను

సూర శ్రీనుకు డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలను అందుకుంటున్న ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావుకు డాక్టరేట్ వచ్చింది. విశాఖపట్నం సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల డైరెక్టర్ రెవ, డాక్టర్ కె.వి.ఎన్.పాల్ స్నాతకోత్సవంలో భాగంగా సోమవారం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కోవిడ్ సమయంలో శ్రీనివాసరావు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల పేర్కొంది. డాక్టరేట్ స్వీకరించిన అనంతరం శ్రీను మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే తనకు నిజమైన సంతృప్తి ఉందన్నారు. తాను ఏనాడూ ప్రశంసలకు ఆలోచించలేదన్నారు. కోవిడ్ సమయంలో అవసరమైన మేరకు లక్షలాది మందికి ఆహార పొట్లాలు, వేలాదిగా నిత్యావసర కిట్లు అందజేసి మానవత్వంతో ఆదుకున్నానని తెలిపారు. ఈ డాక్టరేట్‌తో తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.

నమ్మకం, విధేయతకు పట్టం

ఎంపిపి కడియాల పద్మ



మాట్లాడుతున్న ఎంపిపి పద్మ

ప్రజాశక్తి- కవిటి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకం, పార్టీపై ఉన్న అమితమైన విధేయతే నర్తు రామారావుకు ఎమ్మెల్సీ రూపంలో పట్టం కట్టాయని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. స్థానిక సంస్థల కోటాలో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్తు రామారావును ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన రామారావుకి సరైన గుర్తింపు లభించిందని అన్నారు. రాష్ట్రంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానంతో జెడ్‌పి చైర్‌పర్సన్, డిసిఎంఎస్ చైర్మన్, కార్పొరేషన్ పదవులతో పాటు ఎమ్మెల్సీ అందించిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా వైసిపి అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైసిపి లీగల్‌సెల్ కార్యదర్శి పులకల శ్రీరాములు, ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీకుమార్ దొలై, ఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, సనపల కృష్ణారావు పాల్గొన్నారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఐటి ద్వితీయ ఏడాదికి చెందిన 143 మంది విద్యార్థులకు ఈ నెల 20 నుండి 25 వరకు, 27 నుంచి మార్చి 4వరకు రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిఎంస్ ఎక్సెలెన్స్ లేబొరేటరీలో 'డేటా ఎనాలసిస్ యూజింగ్ పైతాన్' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. డేటా విజులైజేషన్, అనకొండా జూపిటర్ నోట్‌బుక్, ఎక్స్‌రేటరీ డేటా ఎనాలసిస్, మిషన్ లెర్నింగ్, డేటా ఎనాలసిస్ విత్ పాండస్, డేటా మేనిపులేషన్ విత్ నుంచి వంటి అంశాలపై ప్రత్యక్ష శిక్షణివ్వడం ద్వారా అవగాహన కల్పిస్తారని డైరెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఈ



డైరెక్టర్ నాగేశ్వరరావుతో శిక్షకులు

రంగాలపై నైపుణ్యతలు పెరగడం వల్ల భవిష్యత్‌లో మంచి ఉద్యోగావకాశాలు దక్కుతాయని తెలిపారు. టి.శ్రీకన్య ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ తరగతుల్లో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐటి హెచ్ఐడి డాక్టర్ వై.రమేష్, ఎపిఎస్ఎసిసి స్పోక్ డాక్టర్ వి.అశోక్‌కుమార్, ఐటి విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.పాండురంగ, విఠల్ పర్యవేక్షణ చేస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

లక్ష్యాల పూర్తికి కృషి



సమీక్షిస్తున్న ధనలక్ష్మి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ సంఘం విఒఎలు వారి ప్రాజెక్టు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సక్రమంగా నిర్వహించేటట్టు కృషి చేయాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అన్నారు. పట్టణంలోని మండల సమాఖ్యలో విఒఎల సిబ్బందితో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత లబ్ధిదారులందరితో వారికి ఆసక్తి ఉన్న జీవనోపాధి కార్యక్రమాలు చేయించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను గ్రామాల్లో మహిళలకు ఆసక్తి కలిగేలా, దానివల్ల ఒనగూరే ప్రయోజనాలు లబ్ధిదారులకు అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు మాట్లాడుతూ మహిళా స్వయం శక్తి సంఘాల్లో సభ్యుల ఐక్యత వల్లే గ్రామాల్లో సంఘాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీనిధి, బ్యాంకు రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తద్వారా కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల సమైక్య ప్రతినిధులు కోశాధికారి రేణుక, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చంద్రరావు, రమణ, సుభద్ర, ఉమా, డేటాఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : మెళియాపుట్టి మండలం జాడుపల్లి ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో భాగంగా పిల్లలకు వంట చేస్తుండగా కాలిపోయి మృతి చెందిన వంట కార్మికురాలు మలిపెద్ది రమ కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఉత్తర, అల్లు మహాలక్ష్మిలు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట మృతురాలికి న్యాయం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేశారు. ఈ నెల 14న పాఠశాలలో వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకుని గాయాలు పాలైందని, విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఈనెల 18న మృతి చెందిందని అన్నారు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మృతురాలి కుమారుడు మలిపెద్ది హేమంత్, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.సుశీల, బి.శోభారాణి, ఆదిలక్ష్మి టి.సీతమ్మ, వి.లక్ష్మి, రాధ, జి.పద్మావతి, టి.రామానుజం పాల్గొన్నారు.

28న విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానం రామకృష్ణాపురం పాఠశాలలో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కలాం సేవా సమితి ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు లఖినాన కరుణాకర్ తెలిపారు. సోమవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే వివిధ పాఠశాలలు నుండి ఈ నెల 23వ తేదీలోగా ఎంట్రీలు పంపుకోవాలని కోరారు. 5వ తరగతి వరకు గ్రూపులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.2వేలు, రూ.1500, రూ.1000, 6 నుండి 8వ తరగతి వరకు గ్రూపునకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.2500, రూ. 2000 ఇవ్వనున్నట్లు చెప్పారు. 9, 10వ తరగతులకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.3000, రూ.2500లు ప్రైజ్ మనీతో పాటు షీల్డ్ అందించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక సర్టిఫికేట్‌లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంట్రీల కోసం 9704468224, 9177305519, 9133272150, 9550134487 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

తారకరత్నకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీనటుడు, నందమూరి కుటుంబం నుంచి వచ్చిన తారకరత్న వివాద రహితుడని, మృధు స్వభావం గల వ్యక్తి అని, చిన్న వయసులోనే అకాల మరణం పొందడం అభిమానులకు తీరని లోటని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో తారకరత్న చిత్రపటానికి సోమవారం పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీతో తారకరత్నకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. తొమ్మిది సినిమాలను ఒకే రోజున ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నటుడు గానే కాక నందమూరి కుటుంబానికి గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జామి భీమశంకరరావు, సురకాశి వెంకటరావు, దుంగ సుధాకర్, రోణంకి కళ్యాణ్, ఎస్.వి.రమణ మాదిగ, కెల్ల కొండలరావు, జల్లు రాజీవ్, నందమూరి అభిమాన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

పొందూరు: ప్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా రోగుల ఇంటివద్దకే వైద్య సేవలను అందజేస్తున్నట్లు వైద్యాధికారులు జి.రమేష్‌నాయుడు, ఎస్.శివశంకరరావులు అన్నారు. మండలంలోని మలకాం, రాపాక గ్రామాల్లో 104 ప్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే పలువురు ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిఇఒ నర్సింహులు, ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, జోత్స్న, సూర్యకాంతం, ఎఎన్ఎం సుజాత, వనజాక్షి, ఉదయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, రమణ, సూపర్‌వైజర్లు బెనర్జీ, రాములమ్మ, డిఇఒ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు లక్ష్మి, రాజు, ఉష, పుణ్యవతి, అమ్మాజీ, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

'నర్తు'కు ఎమ్మెల్సీపై పలువురు హర్షం

విలేకరుల యంత్రాంగం : నర్తు రామారావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై పలువురు వైసిపి నాయకులు హర్షం తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, కోటబొమ్మాళి ఎంపిపి ఆర్.ఉమామల్లేశ్వరరావు, సోంపేట ఎంపిపి డాక్టర్ ఎం.దాసు, వైసిపి సంతబొమ్మాళి సీనియరు నాయకులు సుగ్గు రామిరెడ్డి, టెక్కలికి చె ందిన యాదవ సంఘం నాయకులు చిన్ని జోగారావు, బర్ల తవిటయ్య, మన్నెల కిషోర్, శంకరరావు హర్షం తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వేర్వేరుగా మాట్లాడారు. ముఖ్యమంత్రి అన్ని సామాజిక తరగతులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని వారు తెలిపారు. హర్షం తెలిపిన వారిలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, సోంపేటకు చెందిన నాయకులు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వినోద్, మడ్డు రాజారావు, కె.కామేశ్వరరావు, వెంకటనారాయణ, సతీష్, కృష్ణ, దుక్క భూషణ్‌రెడ్డి, వై.రామరాజు, సూరాడ రాజారావు, అట్టాడ రమణ, అనంత్ హన్నురావు, జి.సవరయ్య, బి.కొండయ్య, సుగ్గు శ్రీనివాస్‌రెడ్డి, పి.సురేష్, కె.పాపారావు, ఢిల్లేశ్వరరావు, లక్ష్మణ, తదితరులు ఉన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్వయంశక్తి సంఘాల సభ్యులు పొదుపు డబ్బులను ఆదాయాభివృద్ధికి ఖర్చు చేసి, ఆర్థికాభివృద్ధి సాధించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల సభ్యులతో సమీక్షించారు. పిఎం జెజెబివై, ఎస్‌బివై అర్హత కలిగిన ప్రతి సంఘంలో ఉన్న మహిళలు, వారి కుటుంబసభ్యులకు ఇన్సురెన్స్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సామాజిక పెట్టుబడి రుణాలు పొందాలంటే తప్పనిసరిగా ప్రతి సంఘం తీర్మానంతో పాటు ఆ సభ్యురాలి బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయించాలన్నారు. శ్రీనిధి రుణం రూ.4.50 లక్షలు తొమ్మిది మంది సభ్యులు వాడుకొని ఉపయోగించుకోవడానికి ప్రస్తుతం అవకాశం ఇవ్వబడిందన్నారు. సమావేశంలో సిసిలు ఎ.రామకృష్ణ, మోహనరావు, అకౌంటెంట్ మోహిని, ఆపరేటర్ విష్ణుబాబు, 35 మంది విఒఎలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం ప్రసాదరావు



నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి త్రినాథరావు

52 మందికి నేత్ర వైద్య పరీక్షలు


కొత్తూరు : మండలంలోని కురిగాం పిహెచ్‌సి, పార్వతీపురం మన్యం జిల్లా భామిని పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యాన స్థానిక వెంకటేశ్వర కళ్యాణ మండపంలో సోమవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు అంధత్వ నివారణ జిల్లా అధికారి కె.త్రినాథరావు 52 మందికి నేత్రాలను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అందులో 27 మంది రోగులకు కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేసినట్లు ఆప్తాలమిక్ వైద్యాధికారి ఇప్పిలి జానకిరామయ్య తెలిపారు. వీరిని జిల్లా సర్వజనాస్పత్రికి తరలించామని చెప్పారు. కార్యక్రమంలో కంటి విభాగం వైద్యాధికారి టి.జ్యోతిర్మయి, కురిగాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ఐరన్ మాత్రల పంపిణీ



మాత్రలు వేస్తున్న చిట్టిబాబు

ఎచ్చెర్ల : మండలంలోని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని తోటపాలెం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఐరన్ ఫోలిక్ ఏసిడ్ సిరప్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోటపాలెం, కొంగరాం వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు మాట్లాడుతూ ఐరన్ ఫోలిక్ ఏసిడ్ మాత్రలు, ద్రావణం తినిపించడం వల్ల పిల్లల రక్తంలో హెమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతుందన్నారు. తద్వారా పిల్లల శారీరక, మానసిక ఎదుగులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హెచ్‌బి స్థాయిలు ఎక్కువగా ఉన్న పిల్లలు చదువుపై, క్రీడలపై చురుగ్గా ఉండి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రతి గురువారం, అంగన్వాడీ కేంద్రాల్లో సోమ, గురువారాల్లో ప్రభుత్వం ఉచితంగా ఈ ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తుందని తెలిపారు. అనంతరం చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్వాడీ కార్యకర్తకు పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

అలసత్వం వద్దు

మెళియాపుట్టి: విధి నిర్వహణలో అలసత్వం చూపకుండా లక్ష్యాలకు చేరుకోవాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఇంటి పన్ను వసూలు, చాపర, ముకుందపురం పంచాయతీ వార్డు ఎలక్షన్, సెల్ టవర్ల సమాచారం తదితర అంశాలపై కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎఒ తిరుపతి పట్నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైల్వే వంతెన నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- సోంపేట

బారువ రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును టిడిపి నాయకులు కోరారు. నాయకులు దున్న సత్యం, కాళ్ల జయరావ్, దున్న సోమశేఖర్ ఎంపీని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే బారువ రైల్వే క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. బారువ రైల్వే స్టేషన్లో ఇంటర్‌సిటీ, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయాలని అన్నారు. బారువను ఖుర్దా డివిజన్‌లో కాకుండా వాల్తేరు డివిజన్‌లో చేర్చాలని కోరారు.



పోస్టర్లను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

డి.ఆర్ వలసలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'

జి.సిగడాం : మండలంలోని దాలెంరాజువలస పంచాయతీ డి.ఆర్.వలసలో టిడిపి నాయకులు సోమవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనలో అభివృద్ధి లేని పాలన, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న జానపద నృత్యాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గుల్లలపాడులో నీలకంఠేశ్వర ఆలయం 65వ వార్షికోత్సవం, శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి బొడ్డపాడుకు చెందిన కిక్కిరి ఢిల్లీ నేతృత్వంలోని జెస్సి ఈవెంట్స్ వారు ప్రదర్శించిన జానపద కళ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముందుగా దేవతా మూర్తులను తిరువీధుల్లో ప్రదర్శించారు. ప్రతి ఏడాదీ శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నీలకంఠేశ్వర యువజన సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలంలోని రాపాకలో వరలక్ష్మి బాల పేరంటాలు యాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ యాత్ర ముగిసింది. చివరి రోజు సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచాను కాల్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

యువిివి గ్రంథాలయానికి కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నీలావతి గ్రామంలోని ఉద్దాన విద్య అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి ఆ సంఘం గౌరవ సలహాదారులు, ఎక్సైజ్ సిఐ దున్న రామకృష్ణ కంప్యూటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్నారు. గ్రంథాల ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మంది యువకులు, నిరుద్యోగులు చదువుకునేందుకు ఒక వేదికగా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. డిజిటల్ గ్రంథాలయంగా మార్పుచేసి విద్యార్థులకు, నిరుద్యోగ యువకులకు ఉపయోగపడేలా ఉండాలని కంప్యూటర్ వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువిివి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఇసాకోటి జోగారావు, బొడ్డు చిన్నారావు, గౌరవ అధ్యక్షులు ఓంకార్, ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ, గ్రంథాలయ నిర్మాణ కమిటీ కన్వీనర్ ప్రకాశరావు, ఆర్థిక కార్యదర్శి వై.కామేష్, తెప్పల వాసుదేవరావు, జినగ సీతారాం, తంగుడు భగేష్, పాలిన కృష్ణారావు, దున్న సోమేశ్వరరావు పాల్గొన్నారు.



కంప్యూటర్‌ను అందిస్తున్న రామకృష్ణ

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

నరసన్నపేట: రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి వ్యవస్థలను నాశనం చేయడానికి బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. విశాఖ ఉక్కును పోస్కో కంపెనీకి కారు చౌకగా అమ్మకానికి పెట్టిందని, వీటిని వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఒక పరిశ్రమ కూడా నెలకొల్పు లేకపోవడం వల్ల నిరుద్యోగం విలయతాండవం చేస్తోందన్నారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, లేకుంటే అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా ఎ.రాము, కార్యదర్శిగా ఎన్.సాంబశివరాజు, సహాయ కార్యదర్శులుగా బి.తులసి, శ్యామ్, ఆరుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టిడిపి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఎ.లీలారాణి అన్నారు. సోమవారం ఆమె డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాడీ, అధ్యాపకులు గణపతి, గుజ్జు ఈశ్వర్, శాసనపురి నాగేశ్వరరావుతో మాట్లాడారు. విద్యార్థుల విద్యా విధానంపై చర్చించారు. డిగ్రీ కళాశాలకు రోడ్డు, ప్రహరీ అవసరమని గుర్తించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడుతున్న లీలారాణి

గాంధీ మందిరం సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : మానవాళిని సన్మార్గంలో నడిపించే సిద్ధాంతాలను మహాత్మాగాంధీ ప్రతిపాదించారని గాంధీ మందిరం అధ్యక్షులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ అన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పాలక మండలి సభ్యునిగా నియామకమైన లుకలాపు గోవిందరావు గాంధీ మందిరాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను కృష్ణమోహన్ అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కె.ఎన్.ఎస్.ప్రసాద్, జగన్నాథనాయుడు, విష్ణుమూర్తి, పొన్నాడ రవికుమార్, ఖాన్ పాల్గొన్నారు.



ఎల్ఎన్‌పేట : ఆర్థికసాయం అందజేస్తున్న ఎంజిఆర్ సభ్యులు

ఎల్ఎన్‌పేట : మండలంలోని దప్పపాడు, పెద్దకోట గ్రామాల్లో జలుమూరు మండలం శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు వచ్చే యాత్రికులకు ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు తన టీమ్ సభ్యుల ద్వారా సోమవారం ఆర్థికసాయం అందజేశారు. దబ్బపాడు సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ లక్ష్మణరావుకు రూ.పది వేలు, పెద్దకోటలో ఏర్పాటు చేసిన అన్నదానానికి రూ.30 వేలు ఆర్థిక విరాళం గ్రామస్తులకు అందించారు. కార్యక్రమంలో వెలమల గోవిందరావు, కాగాన మన్మథరావు, కొవిలాపు కృష్ణమాచార్యులు, అంపిలి పోలినాయుడు, ఎంపిటిసి సిమ్మ మోహన్, ముగుడ భద్రయ్య, కుంచాల బాలకృష్ణ, మక్కా రమణ పాల్గొన్నారు.

పలువురి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీలో నివాసం ఉంటున్న బుట్ట భవానీప్రసాద్, బచ్చల సింహాద్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీ సేవా సమితి చికిత్స కోసం రూ.15వేలు, బియ్యం బస్తా, కిరాణా సరుకులను సమకూర్చారు. ఈ మొత్తాన్ని, నిత్యావసర సరుకులను 23వ వార్డు కౌన్సిలరు గువ్వాడ ప్రదీప్‌కుమార్ సోమవారం ఇరు కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో గువ్వాడ దిలీప్, గౌరయ్య, అయ్యప్ప, గణేష్, దివాకర్, సంతోష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: నగదును అందజేస్తున్న సభ్యులు



మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

సమన్వయంతో పనిచేయాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామస్థాయి సమస్యలపై నేతలకు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బెలమాంకు చెందిన వైసిపి నాయకులతో, కార్యకర్తలతో గ్రామ సమస్యలు, అభివృద్ధి, పరిష్కారం అనే అంశంపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క సమస్యనూ గుర్తించి వాటి పరిష్కారానికి గ్రామస్థాయి నేతలు ఐక్యతతో కలిసి చొరవ చూపాలని కోరారు. ఇప్పటివరకు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆధునికీకరణ, సుందరీకరణ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వెల్నెస్ సెంటర్ల ద్వారా గ్రామాల్లో ప్రాథమిక వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. పింఛన్లను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కనుగుల కిషోర్, గాంధీ పాల్గొన్నారు.

నేడు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ బృందం పర్యటన

పలాస : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్ట్‌లను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ బృందం మంగళవారం జిల్లాలో పర్యటించనుందని చాపర సుందర్ లాల్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఆఫ్‌షోర్, వంశధార ప్రాజెక్ట్, నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అనంతరం తోటపల్లి ప్రాజెక్ట్ పరిశీలనకు వెళ్తారని అన్నారు. ఈ బృందంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు జెఎన్‌వి ఎస్ఎన్.మూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. నాయకులు లండ వెంకటరావు, చాపర వేణుగోపాల్, సార్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నైర వ్యవసాయ కళాశాలలో వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్ : నైర వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జి.ఎస్.రాయ్, శ్రీసంధ్య రాగోలుల జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రి మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యాన జనరల్, గైనిక్, నేత్ర, రక్తపోటు, మధుమేహం వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

టిడిపిలో పలువురి చేరిక

కొత్తూరు : పాతపట్నం మండలంలోని చాకిపల్లి, జంతిగూడ గిరిజన గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు వైసిపిని వీడి సోమవారం టిడిపిలోకి చేశారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ మండలంలోని మాతల తమ క్యాంపు కార్యాలయంలో వారికి టిడిపి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అబారి, కరువులు, మామిడి లక్ష్మీనారాయణ, రాయల జోగన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతికి సంతాపం

వజ్రపుకొత్తూరు : గరుడభద్ర సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.మాధవి (22) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల కిందట రాజాం దరి బొద్దాం స్వగ్రామంలో మృతి చెందారు. ఈ మేరకు సచివాలయంలో సర్పంచ్ గూడ గిరిజ ఆధ్వర్యాన సంతాపసభ నిర్వహించారు. చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు, రాజాం సర్పంచ్ పిట్ట గీతారాణి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.